EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

మంగళవారం

25-02-2025

పేజీలు: 02







## 300 చిన్నారులపై వైద్యుడు లైంగిక దాడి

వైద్యులను 'వైద్యో నారాయణ హరి' అంటారు. అంటే.. వైద్యులు దేవుళ్లతో సమానమని అర్థం. అంతటి పవిత్రమైన వైద్య వృత్తిలో ఉండి మొత్తం వైద్య వృత్తి తలదించుకునే నీచమైన పనిచేశాడు ఓ వైద్యుడు. తన వద్దకు వచ్చిన రోగులకు వైద్యం చేయాల్సింది పోయి వారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఒకరు, ఇద్దరిపై కాదు.. మొత్తం తన సర్వీసులో ఏకంగా 299 మందిపై లైంగిక దాడి చేశాడు. వీరిలో ఎక్కువ మంది చిన్నారులే కావడం మరింత విచారకరం. ఫ్రాన్స్ లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ అత్యంత దారుణమైన ఘటనపై పూర్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఫ్రాన్స్‌లోని బ్రిటానీ అనే ప్రాంతంలో 74 ఏళ్ల జోయెల్ లి స్కార్నెక్ అనే వైద్యుడు గతంలో ఓ ఆసుపత్రిలో సర్జన్‌గా పని చేసేవాడు. 1989 నుంచి 2014 మధ్య అతడి వద్దకు వచ్చే రోగులపై లైంగిక దాడి చేశాడు. వారు మత్తులో ఉండగా ఈ దారుణానికి పాల్పడేవాడు. అయితే జోయెల్ నిజస్వరూపం మాత్రం 2017లో బయటపడింది. తన పొరుగింట్లో ఉంటే ఆరేళ్ల చిన్నారిపై నిందితుడు అసభ్యంగా ప్రవర్తించటంతో కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు నిందితుడు జోయెల్ ఇంటిని తనిఖీ చేయగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి.



## కోట్ల విలువైన స్థలం కబ్జా..

# వంశీపై మరో కేసు

గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారుడు కిడ్నాప్ వ్యవహారంలో అరెస్ట్ అయి జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై మరో కేసు నమోదు చేశారు. గన్నవరం పోలీస్‌స్టేసన్‌లో వంశీపై భూకబ్జా కేసును నమోదు చేశారు పోలీసులు. గన్నవరంలో గాంధీ బొమ్మ సెంటర్‌లో 10 కోట్లు విలువైన స్థలం కబ్జాపై పోలీసులు కేసు ఫైల్ చేశారు. హైకోర్ట్ న్యాయవాది సతీమణి సుంకర సీతామహాలక్ష్మి పేరిట ఉన్న స్థలం కబ్జా చేసినట్టు ఫిర్యాదు వచ్చింది. వ్యవస్థీకృత నేరం క్రింద కేసు నమోదు చేయాలి అని హైకోర్ట్ న్యాయవాది సతీమణి సీతా మహాలక్ష్మి ఫిర్యాదు చేశారు. వల్లభనేని వంశీ తో పాటు మరో 15 మందిపై ఆమె ఫిర్యాదు చేశారు. ఆ రోజు స్థలం కబ్జాపై ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోలేదని ఫిర్యాదులో హైకోర్ట్ న్యాయవాది సతీమణి సీతా మహాలక్ష్మి పేర్కొన్నారు. కాగా.. వంశీ అక్రమాలపై ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు వంశీపై నమోదైన భూకబ్జా కేసును కూడా దర్యాప్తు బృందానికి అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈకేసును అక్కడకు బదిలీ చేయాలంటూ ఫిర్యాదుదారులు కోరారు. తమ వద్ద ఉన్న ఆధారాలు, స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లన్నింటినీ సిట్ బృందానికి ఇస్తామని న్యాయవాది సతీమణి బంధువులు చెబుతున్నారు.

నేడు పోలీసుల కస్టడీకి వంశీ

మరోవైపు ఈరోజు నుంచి మూడు రోజుల పాటు వల్లభనేని వంశీని పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించనున్నారు. విజయవాడ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలీస్ కస్టడీకి తీసుకుని విచారించనున్నారు. రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీకి వెస్ట్రన్ టాయిలెట్, మంచం సదుపాయాలు కల్పించాలని కూడా కోర్టు ఆదేశించింది. వంశీని విచారించేందుకు ఇప్పటికే పోలీసులు పలు ప్రశ్నలను సిద్ధం చేసుకున్నారు. పోలీసులు విచారిస్తున్న సమయంలో రోజుకు నాలుగు సార్లు వంశీ తరుపున న్యాయవాదులకు కలిసేందుకు న్యాయమూర్తి అనుమతి ఇచ్చారు. విజయవాడ లిమెట్స్‌లోనే వంశీని విచారించాలని కోర్టు ఆదేశించింది. సత్య వర్ధన్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను అధారంగా చేసుకుని వంశీని పోలీసులు విచారించనున్నారు. ఇదిలా ఉంటే వంశీ బెయిల్ కోసం ఇప్పటికే కోర్టులో వంశీ తరుపున న్యాయవాది పిటషన్ దాఖలు చేశారు. ఈరోజు బెయిల్ పిటిషన్‌పై పోలీసులు కౌంటర్ దాఖలు చేయనున్నారు. ఈరోజు లేక రేపు బెయిల్ పిటిషన్‌పై న్యాయమూర్తి ఎదుట ఇరువర్గాల న్యాయవాదులు తమ వాదనలను వినిపించనున్నారు.



## షాక్ ఇస్తున్న బంగారం ధరలు

బంగారం ధరలు పసిడి ప్రియులకు మరోసారి షాక్ ఇచ్చాయి. రెండ్రోజులుగా స్వల్ప తేడాతో స్థిరంగా కొనసాగిన రేట్లు నేడు (25-02-2025) భారీగా పెరిగాయి. అంతర్జాతీయ రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి కారణంగా కొన్ని నెలలుగా బంగారం, వెండి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా నూతన అధ్యక్షుడు ట్రంప్ సంచలన నిర్ణయాలు స్టాక్ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. దీంతో పసిడిని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్న మధుపరులు దాన్ని కొనుగోలు చేసేందుకు పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ధరలు పెరుగుతూ వస్తున్నాయి. అతి త్వరలోనే బంగారం ధర రూ.90 వేలకు చేరుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఫ్లాట్‌గా ట్రేడవుతున్న స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాల నడుమ మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సూచీలు ఒడుదొడుకులకు లోనవుతున్నాయి. సెన్సెక్స్ 101 పాయింట్లు పెరిగి 75,555 వద్ద కొనసాగుతుండగా నిఫ్టీ 9 పాయింట్లు కుంగి 22,546 వద్ద కదలాడుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 86.88 వద్ద కొనసాగుతోంది.



## కేసీఆర్‌ను టచ్ చేసే ధైర్యం ప్రభుత్వానికి లేదు..

### బండి సంజయ్ సెన్సేషనల్ కామెంట్స్

కులగణనకు తాము ఎంత మాత్రము వ్యతిరేకం కాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించబోతోందని అన్నారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో తమ పార్టీనే గెలవబోతోందని.. ఆ విషయం సీఎం రేవంత్ రెడ్డికి కూడా అర్థమయ్యే మూడు జిల్లాల్లో హడావుడిగా ప్రచారం నిర్వహించారని సెటైర్లు వేశారు. రాష్ట్రంలో తప్పుడు హామీలు ఇచ్చి నెరవేర్చలేకపోయారు కాబట్టే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫలితం తమకు అనుకూలంగా రాబోతుందని అన్నారు.అదేవిధంగా బీసీల కులగణన తప్పులతడకగా సాగిందని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్లు అని చెబుతోన్న సర్కార్ 32 శాతం మాత్రమే అమలు చేయలేనే కుట్ర చేస్తోందని ఫైర్ అయ్యారు.




## శాంసంగ్ ట్రిపుల్ ఫోల్డ్ స్మార్ట్ ఫోన్

శాంసంగ్ ఫోల్డబుల్ ఫోన్‌లకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న విషయం తెలిసిందే. అయితే, త్వరలో శాంసంగ్ ట్రిపుల్ ఫోల్డ్ ఫోన్ కూడా త్వరలో విడుదల కానుందని సమాచారం. ఏప్రిల్‌లో ఈ ఫోన్ల ఉత్పత్తి మొదలవుతుందని, జూన్ నెల కల్లా మార్కెట్లోకి రావొచ్చని టెక్ రంగ విశ్లేషకులు చెబుతున్నారు. మీడియా కథనాల ప్రకారం, ట్రిపుల్ ఫోల్డ్ ఫోన్ పేరు గ్యాలెక్సీ జీ ఫోల్‌డ్‌గా ఖరారైందట. వాస్తవానికి ట్రిపుల్ ఫోల్డ్ గురించి శాంసంగ్ 2023లోనే ప్రకటించింది. ఇందుకు సంబంధించిన సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నట్టు అప్పటి శాంసంగ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్‌లో పేర్కొంది. ఆ తరువాత కొంత కాలానికే హువావే ట్రిపుల్ ఫోల్డ్ ఫోన్ మాటే ఎక్స్‌టీ పేరుతో మార్కెట్లోకి తెచ్చింది. తొలుత చైనాలో ప్రవేశపెట్టి ఆ తరువాత ప్రపంచమంతా లాంచ్ చేసింది. దీంతో, ఒక్కసారిగా పోటీ తీవ్రం కావడంతో శాంసంగ్ కూడా ఈ విషయంపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించింది.

## గంజాయితో నలుగురి అరెస్ట్


కవిటి పోలీస్ స్టేషన్ లో సోమవారం సాయంత్రం కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవిటి మండల పరిధి ఆర్. బెలగాం గ్రామ సమీప జాతీయ రహదారి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఓ ద్విచక్ర వాహనంపై అక్రమంగా గంజాయి తరలిస్తున్న నలుగురి వ్యక్తులను అరెస్ట్ చేశామన్నారు. నిందితులు నుంచి సుమారు 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



# సీరత్ హాట్ గ్లామర్ ట్రీట్

సీరత్ కపూర్..

మోడలింగ్ రంగం నుంచి సినిమా ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. సినిమాల్లో ముందుగా అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా కెరీర్ స్టార్ట్ చేసి ఆపై హీరోయిన్ గా ప్రమోషన్ పొందింది. ఆ తర్వాత తెలుగులో సరైన హిట్స్ లేక రేసులో వెనకబడింది. దీంతో వరుసగా హాట్ ఫోటో షూట్స్ తో సోషల్ మీడియాను హీటెక్కిస్తోంది. సీరత్ కపూర్ ఫిల్మ్ ఇండస్ట్రీలో అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా కెరీర్ ప్రారంభించి ఆపై కథానాయిక అయింది. అంతేకాదు తొలి సినిమాతో మంచి హిట్ ను తన ఖాతాలో వేసుకుంది. 2014లో శర్వానంద్ హీరోగా తెరకెక్కిన'రన్ రాజా రన్' మూవీతో కథానాయికగా ఇంట్రడ్యూస్ అయింది. ఈ సినిమా సక్సెస్ అయినా.. ఈ అమ్మడికి పెద్దగా బ్రేక్ లభించలేదు. ఆ తర్వాత తెలుగులో 'టైగర్', 'కొలంబస్', 'రాజు గారి గది 2', 'ఒక్క క్షణం', 'టచ్ చేసి చూడు', కృష్ణ అండ్ హిజ్ లీలా', మా వింత గాథ వినుమా' వంటి చిత్రాలతో పలకరించింది. ఈ సినిమాలేవి సీరత్ ఫేట్ ను మార్చలేకపోయాయి.అందుకే సినిమాల్లో ఛాన్సుల క్సం సీరత్ కపూర్ ఇపుడు వరుసగా హాట్ ఫోటో షూట్స్ ను నమ్ముకుంది. దీంతో పూటకో ఫోటో షూట్ తో సోషల్ మీడియాను హీట్ ఎక్కిస్తోంది.



## వెహికల్ జోన్‌గా ప్రయాగ్‌రాజ్

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళా చివరి దశకు చేరింది. రేపటితో ఈ మహాకుంభమేళా ముగియనుంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు తరలివెళ్తున్నారు. చివరి అమృత్ స్నానం కోసం కోటి మందికిపైగా భక్తులు వస్తారని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగానే ప్రయాగ్‌రాజ్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించింది. ఇవాళ సాయంత్రం 4 గంటల నుంచి కుంభమేళా ప్రాంతాన్ని 'నో వెహికల్ జోన్'గా మారుస్తున్నామని అధికారులు ప్రకటించారు. సాయంత్రం 6 గంటలకు ప్రయాగ్‌రాజ్ మొత్తం ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. అత్యవసర, నిత్యావసర సర్వీసులకు చెందిన వాహనాలను మాత్రమే అనుమతించనున్నట్లు ప్రకటించారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM




## బ్లాక్ బస్టర్ తండేల్ ఓటీటీ డేట్ ఫిక్స్

అక్కినేని యువ ఆ సామ్రాట్ నాగ చైతన్య నటించిన లేటెస్ట్ మూవీ తండేల్. చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అందమైన ప్రేమకథగా తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సినిమాలో నాగచైతన్యకు జోడీగా సాయి పల్లవి నటించింది. తండేల్ సినిమాలో సాయి పల్లవి, నాగచైతన్య ఇద్దరూ తమ నటనతో మెప్పించారు. ఫిబ్రవరి 7న తండేల్ సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది. విడుదలకు ముందే పాటలు, ట్రైలర్ ద్వారా అంచనాలు పెంచిన ఈసినిమా.. విడుదలయ్యాక భారీ రెస్పాన్స్ అందుకుంది. సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుని మంచి వసూళ్లను తన ఖాతాలో వేసుకుంటుంది. చైతూ కెరీర్ లోనే ఈ సినిమా ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఈ సినిమాలో రాజు, సత్య పాత్రలో నాగచైతన్య, సాయి పల్లవి జీవించేశారని..ముఖ్యంగా ఎమోషనల్ సీన్లతో చైతూ ఏడిపించేశాడని ప్రశంసలు కురిపిస్తున్నారు ఫ్యాన్స్. వీరి మధ్య హృద్యమైన ప్రేమను ముడిపెడుతూ.. దానికి సినిమాటిక్ హంగుల్ని జోడించి తెరపైన ఆసక్తిని రేకెత్తించడంలో దర్శకుడు విజయవంతమయ్యారు. ఈ సినిమాకు సంగీతం మరో హైలెట్. దేవీ శ్రీ ప్రసాద్ అందించిన సంగీతం సినిమాకే హైలెట్. ఈ మూవీలోని పాటలన్నీ సూపర్ హిట్ గా నిలిచాయి.



## ఆ రీజనబుల్ టైం అంటే ఎంత?:
### తెలంగాణ స్పీకర్‌కు సుప్రీం కోర్టు ప్రశ్న

తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంపై సుప్రీం కోర్టు మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన తమ పది మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ పార్టీ వేర్వేరుగా రెండు పిటిషన్లను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా.. రీజనబుల్ టైం అంటే ఎంతో చెప్పాలంటూ తెలంగాణ స్పీకర్‌ను కోరింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యల కోసం రీజనబుల్ టైం కోసం స్పీకర్ ఎదురు చూస్తున్నారని అసెంబ్లీ కార్యదర్శి తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు. అయితే.. సుప్రీంకోర్టు గత తీర్పుల ప్రకారం రీజనబుల్ టైమ్ అంటే మూడు నెలలు మాత్రమేనని బీఆర్ఎస్ వాదించింది. ఈ నేపథ్యంలో ఆ రీజనబుల్ టైం ఎంతో చెప్పాలంటూ కోర్టు తెలంగాణ స్పీకర్‌ను ప్రశ్నిస్తూ పిటిషన్‌ను వాయిదా వేసింది. మార్చి 4వ తేదీన బీఆర్ఎస్ పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం మరోసారి విచారణ జరపనుంది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్ల వెంకట్రావు సహా 10 మంది విషయంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలు చేయడం లేదంటూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్ వేశారు. అలాగే.. ఎమ్మెల్యేలపై అనర్హత విషయంలో గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు అమలు చేయడం లేదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరో పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్లను కలిపి ద్విసభ్య ధర్మాసనం విచారిస్తోంది. ఆ పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేలా తెలంగాణ స్పీకర్‌ను ఆదేశించాలని బీఆర్ఎస్ సుప్రీం కోర్టును అభ్యర్థిస్తోంది.



## ఏనుగుల బీభత్సం.. ఐదుగురు మృతి

అంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లాలో ఏనుగుల బీభత్సానికి ఐదుగురు మృతి .అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం గుండాలకోన ఆలయానికి శివరాత్రి సందర్భంగా వచ్చిన భక్తులపై ఏనుగులు దాడి చేశాయి, ఈ దాడిలో వై. కోటకు చెందిన ఐదుగురు భక్తులు మృతిచెందగా, మరో ఇద్దరు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు.క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా అటవీ ప్రాంతంలో ఆహారం దొరకపోవడంతో గత కొంత కాలంగా అడవి జంతువులు తరచూ జనావాసాల్లోకి ప్రవేశించి ప్రజలపై దాడికి పాల్పడుతున్నాయి. చిరుత, ఏనుగుల దాడులలో పదుల సంఖ్యలో జనాలు ప్రాణాలు కోల్పోయారు. ఎంతో మంది గాయాలపాలయ్యారు. అటవీ జంతువులు కనిపిస్తే వాటి ముందుకు వెళ్లకూడదని, వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

**ఏనుగుల దాడి.. మృతులకు రూ.10లక్షల పరిహారం ప్రకటించిన పవన్ కళ్యాణ్**

ఏపీలోని అన్నమయ్య జిల్లా గుండాలకోన ఏనుగుల దాడి ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అటవీ శాఖ అధికారులను అడిగి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అలాగే మృతుల కుటుంబాలకు నష్ట పరిహారంగా ఒక్కొక్కరికి రూ.10 లక్షలు, క్షతగాత్రులకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. అనంతరం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా అటవీ ప్రాంతాల్లో ఉన్న ఆలయాలను దర్శించుకునే భక్తులకి తగిన భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ఈ ఘటనపై సీఎం చంద్రబాబు కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సిఎం అధికారులకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు పరామర్శించి ధైర్యం ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యేలకు సూచించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని సీఎం ప్రకటించారు. కాగా, అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండల పరిధిలోని గుండాలకోనలో ఉన్న శివాలయానికి శివరాత్రి సందర్భంగా భక్తులు తరలివెళుతుంటారు. సోమవారం రాత్రి 14 మంది భక్తులు కాలినడకన అటవీ మార్గంలో వెళ్తుండగా ఏనుగుల గుంపు భక్తులపై దాడి చేసింది. ఈ ఘటనలో ఐదుగురు భక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మృతులు ఉర్లగడ్డ పోడు గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. దాడి నుంచి 8 మంది భక్తులు ప్రాణాలతో బయటపడ్డారు.




## టీజర్‌తో హిట్ 3పై మరింత హైప్!

నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన రీసెంట్ సినిమాలు వరుసగా సాలిడ్ హిట్ అయ్యిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాలు తర్వాత తను చేస్తున్న మరో అవైటెడ్ సినిమానే హిట్ 3. తను పరిచయం చేసిన యువ దర్శకుడు శైలేష్ కొలను కాంబినేషన్ లో చేస్తున్న ఈ సినిమా పట్ల మొదటి నుంచి కూడా మంచి అంచనాలు ఉన్నాయి. కానీ ఇపుడు లేటెస్ట్ గా వచ్చిన టీజర్ తర్వాత మాత్రం ఇవన్నీ ఒక్కసారిగా పెరిగిపోయాయి అని చెప్పాలి. ఊహించని లెవెల్లో మేకర్స్ ఈ టీజర్ ని కట్ చెయ్యడం మెయిన్ గా నాని ఆశ్చర్య పరచడం ఇందుకు ప్రధాన కారణం అని చెప్పవచ్చు. దీనితో ఈ సినిమా కోసం మాత్రం అభిమానులు న్యూట్రల్ ఆడియెన్స్ కూడా ఓ రేంజ్ లో ఎదురు చూస్తున్నారు.

## 'పెళ్లి కాని ప్రసాద్'గా సప్తగిరి

తన కామెడీ టాలెంట్‌తో గుర్తింపు తెచ్చుకున్న సప్తగిరి, కొంత గ్యాప్ తర్వాత మళ్లీ తన స్టైల్‌లో సరికొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. 'పెళ్లి కాని ప్రసాద్' పేరుతో సప్తగిరి ఓ సినిమా చేశాడు. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను కే.వై. బాబు, భాను ప్రకాష్ గౌడ్, సుక్క వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా మార్చి 21న గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. పైగా ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (దిల్ రాజు) విడుదల చేస్తుండడం మరో విశేషం. దిల్ రాజు బ్యానర్ నుంచి సినిమా రిలీజ్ అవుతుంది అనేసరికి, ఈ సినిమాపై ప్రేక్షకులలో అంచనాలు పెరిగాయి. కాగా తాజాగా మేకర్స్ రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంది.




## కత్తులతో పొడిచి.. ఆదిలాబాద్‌లో యువకుడు దారుణ హత్య

ఆదిలాబాద్ పట్టణంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పట్టణంలోని మార్కెట్ యార్డు వెనకాల ఉన్న ఇందిరానగర్‌లో రవితేజ అనే యువకుడిని దుండగులు కత్తులతో నరికి చంపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడిది ఆదిలాబాద్‌లోని క్రాంతినగర్ అని చెప్పారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు హత్య జరిగినట్లు తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. పాతకక్షల నేపథ్యంలోనే హత్య జరిగినట్లు అనుమానిస్తున్నారు. దుంగడులను గుర్తించేందుకు మార్కెట్ చుట్టుపక్కల ఉన్న సీసీటీవీ వీడియోలను పరిశీలిస్తున్నారు.

## ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటం: వైఎస్ జగన్

ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటాన్ని కొనసాగిస్తామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. కూటమి ప్రభుత్వంపై క్షేత్ర స్థాయిలో తీవ్ర వ్యతిరేకత నెలకొందని.. టీడీపీ ఇస్తామన్న పథకాలన్నీ మోసాలుగా మిగిలిపోయాయని ధ్వజమెత్తారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. 'మనం యుద్ధరంగంలో ఉన్నాం.. విజయం దిశగా అడుగులు వేయాలి.. ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటం చేయాలి.. నిజాయితీగా, చిత్తశుద్ధితో ప్రజల తరఫున పోరాటం చేయాలి.. ప్రజలకు తోడుగా ఉంటూ వారితో మమేకమైతే గెలుపు సాధించినట్లే. ప్రజా సమస్యలపై పోరాటంలో వెనుకడుగు వేయవద్దు. మనం వేసే ప్రతి అడుగూ పార్టీ ప్రతిష్టను పెంచేదిలా ఉండాలి. ఎక్కడా రాజీ పడకూడదు' అని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు. సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

మీ భవిష్యత్తుకు నాది భరోసా..

ఈ ప్రభుత్వాన్ని చూసి భయపడాల్సిన అవసరం లేదు. ప్రతిపక్షంలో మన సమర్థతను నిరూపించుకోవడానికి ఇదొక అవకాశం. ప్రతి ఒక్కరికీ నేను భరోసా ఇస్తున్నా. మీ భవిష్యత్తుకు నాది భరోసా. నేను మరో 30 ఏళ్లు రాజకీయాలు చేస్తా. పార్టీ కోసం, ప్రజల కోసం గట్టిగా పని చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. కళ్లు మూసుకుని తెరిచేలోగా ఏడాది గడిచిపోతోంది. జమిలి ఎన్నికలు అంటున్నారు. అదే జరిగితే ఎన్నికలు మరింత ముందుగా వస్తాయి. అందుకే ప్రజా సమస్యల విషయంలో ఎక్కడా రాజీ వద్దు. ప్రజల తరఫున గొంతు విప్పే విషయంలో ఎక్కడా తగ్గాల్సిన అవసరం లేదు. రాజకీయాల్లో మనం విలువలు, విశ్వసనీయత పాటిస్తున్నాం కాబట్టే ఎన్నో క్లిష్ట పరిస్థితులు



అధిగమించాం. ఇంత దూరం ప్రయాణం చేశాం. దేవుడు మనల్ని అందరినీ తప్పకుండా ఆశీర్వదిస్తాడు.

ఇళ్ల పట్టాలు రద్దు చేస్తే కోర్టుకెళ్తాం..

టీడీపీ కూటమి ప్రభుత్వం అన్యాయంగా ఇళ్ల పట్టాలను రద్దు చేస్తోందని సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వైఎస్ జగన్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వైఎస్ జగన్ స్పందిస్తూ.. ''మన హయాంలో 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చాం. ఏ పార్టీ అని చూడకుండా, పక్షపాతం లేకుండా ఇళ్ల పట్టాలు ఇచ్చాం. ఎవరైనా ఇల్లు కట్టుకోకపోతే ప్రభుత్వమే వారికి ఇల్లు మంజూరు చేసి ఇవ్వాలి. అంతేకానీ పేదలపై కక్షగట్టి పట్టాలు రద్దు చేయడం ఏమిటి? పట్టాలు రద్దు చేస్తే తప్పకుండా కోర్టును ఆశ్రయిస్తాం'' అని స్పష్టం చేశారు.